# 12
# “మరణమువరకు నమ్మకముగా”

నిర్ణయాలు చేసికొనే దానిమీద మనం ఎక్కువగా పఠించాం: ప్రభువైన యేసునందు నమ్మికయుంచే తీర్మానం, క్రైస్తవుడవ్వాలనే తీర్మానం, ఎక్కడ ఆరాధించాలి, పని చేయాలి అనే తీర్మానం. అలాటి తీర్మానాలు చేసికొన్న తరువాత, అంతటికంటె కష్టతరమైన పని ఉంది: అనుదినము క్రైస్తవ జీవితం జీవించడం.

ప్రస్తుతపు పఠనంలో ఈ ఛాలెంజ్‌మీద నేను కేవలం ఉపదేశించగలను. క్రొత్త నిబంధనలో ఎక్కువ భాగం క్రైస్తవుడు ఎలా జీవించాలనే దానికి సంబంధించినదే. ప్రభువైన యేసును వెంబడించేవాడుగా తాను ఎలా మసలుకోవాలో జీవితమంతా నేర్చుకుంటూనే గడుపుతాడు.

## సవాలు

తన చుట్టు ఉన్నవారికంటే తాను ఎక్కువ భక్తిగలవాడుగా క్రైస్తవుడు జీవించాలన్న సంగతి బైబిలును గూర్చి ఎక్కువగా ఎరుగని వారికి కూడా తెలుసు. “మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, … మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి” అని పౌలు హెచ్చరించాడు (రోమా 12:2ఎ). ఛాలెంజ్‌ని ప్రభువు ఈ మాటల్లో వ్యక్తపరచాడు:

> మీరు లోకమునకు వెలుగైయున్నారు; కొండమీదనుండు పట్టణము మరుగైయుండ నేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు కాని అది యింటనుండు వారికందరికి వెలుగిచ్చుటకై దీపస్తంభముమీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి (మత్తయి 5:14-16).

గలతీ. 5లో, మానుకోవలసిన వ్యతిరేక గుణాలు, అలవరచుకోవలసిన సద్గుణాలను గూర్చి పౌలు పేర్కొన్నాడు:

> శరీరకార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితోకూడిన ఆటపాటలు మొదలైనవి. వీటినిగూర్చి నేను మునుపు చెప్పినప్రకారము ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను. అయితే ఆత్మ ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశా నిగ్రహము. ఇట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు (గలతీ. 5:19-23).

పరిపూర్ణమైన జీవితాన్ని నీవు జీవించాలని దీని భావమా? లేదు. పరిపూర్ణమైన

జీవితాన్ని జీవించినవాడు ప్రభువైన యేసు ఒక్కడే. అయితే ఆయనవలె జీవించాలని దాని అర్థం. నీవు ఎంత శ్రేష్ఠుడవై యుండగలవో అంతగానూ ఉండాలి. “దేవుని యెదుట యోగ్యునిగా ఉండడానికి జాగ్రత్త కలిగి యుండుమని పౌలు ఆజ్ఞాపించాడు” (2 తిమోతి 2:15).[1] “దేవునియెదుట యోగ్యునిగా ఉండడానికి నీ చేతనైనదంతా చేయుమని” NIV అంది.[2] “తన్ను శ్రద్ధగా వెదకువానికి ఆయన ఫలము దయచేయువాడు” (హెబ్రీ. 11:6; KJV)[3] – “పరిపూర్ణంగా ఆయనను వెదకడం” కాదు, “శ్రద్ధగా వెదకడం.”

## వాస్తవము

దురదృష్టవశాత్తు, కొన్ని సార్లు దేవుని అనుసరించేవారు సహితం ఎలా జీవించాలో అలా జీవించరు. వారు ఏమి అయ్యుండగలరో, ఎల్లవేళలా అలా ఉండరు. పాపం చేసిన దేవుని ప్రజలయొక్క ఉదాహరణలతో బైబిలు నిండియుంది – వ్యభిచారం చేసిన దావీదు మొదలుకొని, ప్రభువును ఎరుగనని పేతురువరకు (2 సమూ. 11; మత్తయి 26:69–75). యోహాను క్రైస్తవులకు యిలా వ్రాశాడు, “మనము పాపము చేయలేదని చెప్పుకొనినయెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు” (1 యోహాను 1:10). క్రైస్తవుడు పాపం చేసినయెడల అతడు ఏమి చేయవలయును?

### మారుమనస్సు పొందు

అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొంది దేవునియొద్ద క్షమాపణ కోరాలి. సీమోను పాపం చేసినప్పుడు, “కాబట్టి యీ నీ చెడుతనము మానుకొని మారుమనస్సునొంది ప్రభువును వేడుకొనుము; ఒకవేళ నీ హృదయాలోచన క్షమింప బడవచ్చును” అని పేతురు అతనికి తెలిపాడు (అపొ. 8:22). నిజమైన మారుమనస్సు గత జీవితపు లోటులను సహా దిద్దుకొంటుంది.[4]

### పాపమును ఒప్పుకొనడం

మారుమనస్సులో ప్రధాన భాగము ఒకడు తన పాపాన్ని అంగీకరించడానికి యిష్టపడడం. క్రైస్తవుడు ఎల్లవేళలా తన పాపాన్ని దేవునికి ఒప్పుకొంటూ ఉండాలి. “మన పాపములను మనము ఒప్పుకొననియెడల, ఆయన నమ్మదగినవాడును నీతి మంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును” అని యోహాను తెలిపాడు (1 యోహాను 1:9). కొన్ని సార్లయితే అతడు తన పాపాలను యితరుల యొద్దకూడా ఒప్పుకొనవలసియుంది; ప్రత్యేకించి అతని పాపము వారికి తెలిసియుంటే లేక వారికే విరోధంగా పాపము చేసియుంటే: “మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి;[5] మీరు స్వస్థతపొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థనచేయుడి” అని యాకోబు వ్రాశాడు (యాకోబు 5:16ఎ). పాపము ఎంత బహిరంగమయ్యిందో, ఒప్పుకొనడం కూడా అలాగే ఉండాలనేది సాధారణ నియమం.

### ప్రార్థించు

కోట్ చేయబడిన లేఖనాల్లో ఉన్నట్టు, ఎల్లవేళల ప్రార్థన అనేది ఉండాలి. క్రైస్తవుడు ప్రార్థించాలి (అపో. 8:22), కొన్ని సార్లయితే, యితరులు తన కొరకు ప్రార్థించేలా అడుగబడింది (యాకోబు 5:16).

## అభయము

బైబిల్లో నాకు యిష్టమైన లేఖన భాగాలలో 1 యోహాను 1:7 ఒకటి. "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" అని అది తెలుపుతోంది. ఈ లేఖన భాగము వర్తమాన కాలాన్ని ఉపయోగిస్తుంది, అది గ్రీకులో కొనసాగే కార్యక్రమం. నేను వెలుగులో నడుస్తూ ఉంటే, క్రీస్తు రక్తము కడుగుతునే ఉంటుంది – అని దాని అక్షరార్థం.

ఇది యొక ఉత్సాహ పూరితమైన సత్యం. బాప్తిస్మము యొక్క నీళ్లలోనుండి ఒకడు బయటికి వచ్చినప్పుడు, క్రీస్తు రక్తమువలన (ప్రకటన 1:5), అతని సమస్త పాపములు కడిగివేయబడతాయి (అపో. 22:16). అప్పుడు, "అతడు వెలుగులో నడుస్తూ ఉంటే," యేసు రక్తము ప్రతి పాపమునుండి అతనిని కడుగుతూ ఉంటుంది.

"వెలుగులో నడవడం అంటే ఏంటి?" "వెలుగులో నడవడమంటే," దేవుడు తన పిల్లలను ఎలా జీవించాలని కోరుతున్నాడో అలా జీవించడం.[6] సంఘ సభ్యులు పరిపూర్ణంగా జీవిస్తారని దాని అర్థం కాదు, ఎందుకంటే, అలాగైతే కడుగబడవలసిన పాపం వారికి ఏమీ లేకుండపోయేదే. కీలకమైన పదం "నడవడం" క్రైస్తవ నడక అంటే, అతని జీవిత విధానం.

వెలుగులో నడిచేవాడు పరిపూర్ణుడు కాడనేది వాస్తవమే గాని, అతని హృదయము దేవుని మీద కేంద్రీకరింపబడియుంది. దేవుని చిత్తాన్ని జరిగించడానికి అతడు కృత నిశ్చయుడై ఉన్నాడు. క్రైస్తవ మార్గంలో అతడు తొట్రిల్లవచ్చు అయితే అట్టిది సంభవించి నప్పుడు, అతడు మారుమనస్సు పొంది, ఒప్పుకొని, ప్రార్థిస్తాడు. అప్పుడతడు మరలా తమాయించుకున్నవాడై దేవునితో తన నడకను కొనసాగిస్తున్నాడు.

## వాగ్దానము

క్రైస్తవ జీవితాన్ని ఎవడును తన సొంత శక్తితో జీవించలేడు, గనుక సహాయం చేయడానికి దేవుడు వాగ్దానం చేశాడు (అపో. 2:38; రోమా 8:13, 26). ప్రభువు మీద ఆనుకొనేవానికి ఈ వాగ్దానం ఉంది:

> చిన్న పిల్లలారా, మీరు దేవుని సంబంధులు; మీలో ఉన్నవాడు లోకములో ఉన్న వానికంటె గొప్పవాడు గనుక మీరు వానిని జయించి యున్నారు (1 యోహాను 4:4).

> దేవుని మూలముగా పుట్టినవారందరును లోకమును జయించుదురు; లోకమును జయించిన విజయము మన విశ్వాసమే (1 యోహాను 5:4).

ఈ సవాలును, వాగ్దానమును ప్రభువు ప్రసాదించారు: "మరణమువరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవకిరీటమిచ్చెదను" (ప్రకటన 2:10బి). "కిరీటమని" యిక్కడ పలుకబడింది, విజయ మకుటము, "జీవితముతో కూడినదై" నిత్య జీవానికి సంబంధించినది.

మన పఠన పరిచయ భాగంలో, మన ఉద్దేశాన్ని యిలా నిర్వచించాం:

**లక్ష్యము: నిత్య జీవము**

మరణమువరకు ఆయనకు మనం నమ్మకంగా ఉంటే, ఆయన మనకు నిత్య జీవమిస్తానని వాగ్దానం చేశారు. ఆ విధంగా మన గురిని చేరుకుంటాం.

## ముగింపు

దాదాపు మనం మన పఠనం యొక్క అంతంలో ఉన్నాం. వ్యక్తిగతంగా వర్తింప జేసుకొనే సమయం ఆసన్నమయ్యింది. నీకు నిత్య జీవము కావాలా? ప్రభువుకు నీ జీవితాన్ని సమర్పించుకునే అంతగా నీవు దానిని వాంఛిస్తున్నావా? మరణ పర్యంతమైన సమర్పణను నీవు చేయ నిష్టపడుతున్నావా?

---

సూచనలు

[1]ఒత్తి పలికింది నాది. "శ్రద్ధగా ఉండు" అనే దానికి బదులు KJVలో "స్టడీ" అని ఉంది. "శ్రద్ధతో కూడిన ప్రయాసపడు" లేక "నీకు చేతనయ్యింది చేయి" అర్థంతో "స్టడీ అనేదాన్ని" ఉపయోగించవచ్చు. [2]ఒత్తి పలికింది నాది. [3]NASBలో కేవలం "ఆయనను వెదకు" అని ఉందిగాని, గ్రీకులో "శ్రద్ధగా వెదకువానికి" అనే భావన ఉంది. అది పట్టీపట్టనట్టు వెదకడం కాదు. [4]మారుమనస్సును గూర్చిన ఉపదేశాన్ని నీవు రివ్యూ చేయవచ్చు. [5]కన్ఫెషన్లల్ బాక్సులో కూర్చుండే మత అధికారి అనబడేవాడికి పాపాలు ఒప్పుకొనడం కాదు సుమీ. క్రైస్తవులు ఒకరితో ఒకరు ఒప్పుకొనడం. [6]"దేవుడు వెలుగై యున్నాడు" (1 యోహాను 1:5). "వెలుగులో నడవడం" అంటే దేవునితో నడవడం అని అర్థం. ప్రభువైన యేసు "లోకమునకు వెలుగై" యున్నాడు (యోహాను 8:12). గనుక "వెలుగులో నడవడం" ప్రభువుతో నడవడం. దేవుని వాక్యము వెలుగునిస్తుంది (కీర్తన. 119:105), గనుక "వెలుగులో నడవడం" ఆయన వాక్యం ప్రకారం నడవడం అయ్యుంటుంది.